



జెండా ఎగురవేసి బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు







మార్కుల వేటలో బందీ అయిన బాల్యానికి ఆటవిడుపు దొరికింది. పుస్తకాలతో కుస్తీ పట్టిన చిట్టి చేతులు సేదదీరాయి. నాలుగుగోడల మధ్య నిలిచిన సృజనాత్మకత ప్రపంచానికి తెలిసింది. ఆసాంతం ఆ'బాల'గోపాలోత్సవం కనులముందు సాక్షాత్కారం అయ్యింది. ఆటపాటలు, నృత్యరూపాలు, కళానైపుణ్యాలు, అద్భుతమైన తెలివితేటలతో చిన్నారులు చూపరులను సమ్మోహితులను చేశారు. కళాత్మక ప్రదర్శనలు కనులవిందు చేస్తే... సైన్సు ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. వ్యాసరచన వకృత్వ పోటీలు మెదడుకు పదునుపెట్టాయి. ఇలా వందలాది మంది చిన్నారులు ఒక్క చోట చేరి చేసిన సందడి 'అనంతపండుగ'ను తెచ్చింది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం వేదికగా జరుగుతున్న అనంత బాలోత్సవాలు-3 శుక్రవారం నాడు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పిల్లల పండుగలో జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది విద్యార్థులు, చిన్నారులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు.

- ఉత్సాహంగా ప్రారంభమైన 'పిల్లల పండుగ'
- కోలాహలంగా 'అనంత బాలోత్సవాలు'
- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- నృత్యాలతో కనులవిందు
- ఆలోచింపజేసిన సైన్స్ నమూనాలు
- తరలొచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు
- కిటకిటలాడిన ఆర్ట్స్ కళాశాల మైదానం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు తగ్గని సందడి

అనంతం...బాలోత్సవం...!





వేషధారణలో చిన్నారులు..



తన కుమారున్ని అల్లూరి సీతారామరాజు వేషధారణలో బాలోత్సవంకు తీసుకొచ్చిన ముస్లిం మహిళ



బాలోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు కెఎం.షమీమ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవం.. పిల్లల పండుగ అనంతపురం నగరంలో ప్రారంభమైంది. మూడు రోజులపాటు పిల్లలు ఆటపాటలతో చిందులేయడమే కాకుండా, తమ విజ్ఞానాన్ని ప్రదర్శించే పోటీలు ఆరంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన ఈ పోటీలతో ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉత్సహపూరిత వాతావరణం నెలకొంది. రంగురంగుల దుస్తులతో కొంత మంది విద్యార్థులు విచిత్ర వేషధారణలో రాగా, సాంప్రదాయ దుస్తులైన లంగా వోని వేసుకుని మరికొంత మంది జానపద పాటలు పాడారు. రాణి రుద్రమదేవి వేషంతో ఒకరు తమ నటనా ప్రావీణ్యాన్ని ప్రదర్శించగా, తన కుమారుడిని అల్లూరి సీతారామ రాజు వేషంలో కాషాయ వస్త్రాలు ధరింపజేసి ముస్లిం తల్లి బుర్కాలో రావడం కనువిందు చేసింది. తమపిల్లల ప్రతిభా పాటవాలను చూసి మురిసిపోయే తల్లులు కొందరు ఆవరణంలో కనిపించగా, తమ పాఠశాల విద్యార్థి మెరుగైన ప్రదర్శన చేయాలని మరికొంత మంది ఉపాధ్యాయులు ఆరాటపడటం అక్కడ కనువిందు చేసిందనే చెప్పాలి. ఆర్ట్స్ కళాశాల మైదానం మొత్తం పిల్లల పండుగతో కళకళలాడింది.

అట్టహాసంగా ప్రారంభం

అనంత బాల్సోతవం-3 ఉత్సపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పిల్లల పండుగలా ఏటా జరుగుతున్న ఈ అనంత బాత్సోవం మొదటి రోజైన శుక్రవారం నాడు పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వందకుపైగా పాఠశాలల నుంచి విద్యార్థులు 2050 మంది వరకు పాల్గొన్నారు. రెండు విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో ఆకడమిక్‌లో 1130 మంది వరకు విద్యార్థులు పాల్గొనగా, 920 మంది వరకు కల్చరల్ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి రోజు ప్రారంభ కార్యక్రమానికి దిశగా డీఎస్పీ ఎ.శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రారంభ కార్యక్రమానికి బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు కెఎం.షమీమ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ బాలోత్సవాల పేరుతో ఏటా బాలోత్సవ కమిటీ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఎప్పుడూ చదువులేకుండా ఇతర ప్రతిభాపాటవాలను వెలికితీయడంతోపాటు, వాటిని ప్రోత్సహించేందుకు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. ప్రముఖ న్యాయవాది రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాబోయే భవిష్యత్ పిల్లలదేనని వారు, ఆటపాటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఎల్‌కెపి కార్యదర్శి పద్మలత, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు, బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, నాయకులు ఎజి రాజమోహన్, గోవింద రాజు, తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, అంకె శ్రీనివాసులు, యుటిఎఫ్ నాయకులు లింగమయ్య, రమణయ్య, కోటేశ్వరప్ప, నాగేంద్ర, ప్రముఖ కవి రచయిత కంబదూరు నబీరసూల్, మధుశ్రీ, చిలకూరి దీవెన, రోహిణి, శ్యామలమ్మ, రామాంజినమ్మ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఒకవైపు అడకమిక్, మరోవైపు కల్చరల్ పోటీలు మొదటి రోజు జరిగాయి. అడకమిక్ పోటీలకు విద్యార్థులు అధికంగా మొదటి రోజు పోటీపడ్డారు. చిత్రలేఖనం, కార్టూన్, వ్యాసరచన, కథారచన, దినపత్రిక పఠనం, మెమోరీ టెస్టు, స్పెల్ బి, బేస్ట్ ఫ్రంవేస్టు, సైన్సు ఎగ్జిబిషన్‌లో అడమిక్ పోటీలు ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ బ్లాక్‌లో నిర్వహించారు. కల్చరల్ ఈవెంట్స్‌లో జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలాపన, లఘునాటికలు, జానపద గీతాలాపన,విచిత్ర వేషధారణ ప్యాన్సీ డ్రెస్‌లు పోటీల్లో విద్యార్థులు పోటాపోటీగా సాగాయి.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధికారులు, బాలోత్సవ కమిటీ సభ్యులు

బాలోత్సవాలు విద్యార్థులకు ఉపయోగం : డిఇఒ
బహుమతులు అందజేత

అనంత బాలోత్సవాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని జిల్లా విద్యా శాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు అనంత బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిఇఒ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆట పాటలు ఎంతో ముఖ్యమన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత పెంపొందించడానికి అనంత బాలోత్సవం దోహదపడతాయన్నారు. చక్కని వేదికను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల తల్లి తండ్రులు, పాఠశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. డిఇఒతోపాటు బాలోత్సవం పోటీల న్యాయనిర్ణేతలు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈవెంట్స్‌లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులతోపాటు జ్ఞాపిక, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవం కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, సహాయ కార్యదర్శి సావిత్రి, కమిటి సభ్యులు రమణయ్య, నాగేంద్ర, లింగమయ్య, గోవిందరాజులు, న్యాయ నిర్ణేతలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనా గురించి తెలుసుకుంటున్న వి.రాంభూపాల్



బాలోత్సవాన్ని తిలకిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు

పెరుగుతున్న వ్యసనాలు



పెరగని విముక్తి కేంద్రాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రోజురోజుకూ మత్తు పదార్థాలకు బానసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా యువత దాని బారినపడి జీవితాలను కోల్పోతున్న పరిస్థితులున్నాయి. మద్యమే కాకుండా పొగాకు, గంజాయి, మాదక ద్రవ్యాలు, కొన్ని రకాల రసాయనాలను పీల్చడం వంటి వ్యసనాలు పెరుగుతున్నాయి. ఇందులో ప్రధానమైనది మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు వినియోగించి ఆరోగ్యాలను సైతం కోల్పోతున్నాయి. ఇందుకు విరుగుడుగా వ్యసన విముక్తి కేంద్రాలు (డి అడిక్షన్ సెంటర్సు) ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేసింది. కాని ఆచరణలో అవి ఆరంభశూరత్వాలుగానే మిగిలిపోయాయి. రెండేళ్ల క్రితం ప్రారంభమైన దశలోనే అవి ఆగిపోయాయి.

నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటని ప్రకటన

వ్యసనాల్లో ప్రధానమైన మద్యం విక్రయాలను తగ్గించి వేస్తామని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ప్రకటించింది. అదే విధంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యసన విమక్తి కేంద్రాలు (డి అడిక్షన్ సెంటర్సు) ప్రారంభిస్తామని చెప్పింది. ఇందుకు అనుగుణంగా 2020 జూన్ ఒకటవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశ కింద 15 ప్రారంభించారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం సర్వజన ఆసుపత్రి, హిందూపురం జిల్లా ఆసుపత్రిలో రెండు ప్రారంభించారు. ఈ రెండు కేంద్రాలకే విముక్తి కేంద్రాల ఏర్పాటు ఆగిపోయంది. ఇక ప్రారంభమైన ఈ కేంద్రాల్లోనూ అనంతపురం సర్వజన ఆసుపత్రిలోని కేంద్రమొక్కటి కొంత వరకు నడుస్తోంది. ఇక్కడ మాత్రమే డిఅడిక్షన్‌కు సంబంధించి ప్రత్యేకమైన సైక్రియాక్రటిక్ డాక్టర్‌ను నియమించారు. హిందూపురంలో ఆ డాక్టర్ లేకపోవడంతో కేంద్రం ప్రారంభానికే పరిమితమైంది. ఎందుకంటే డిఅడిక్షన్‌కు వైద్యమందివ్వాలంటే తప్పకుండా సైక్రియాటిక్ వైద్యులుండాలి. అది లేకుండా వైద్యమందివ్వడం సాధ్యమవదు. ఇవి లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ప్రారంభానికే పరిమితమయ్యాయి. నడుస్తున్న అనంతపురం సర్వజన ఆసుపత్రిలోనూ పదికి మించి బెడ్స్ లేకపోవడం గమనార్హం. రోజుకు ఇక్కడ 20 మంది వరకు మత్తుకు బానిసైన వారు వస్తుంటారు. ఇందులోనే ఇతర మానసిక జబ్బులతో వచ్చే వారినీ ఉంచుతున్నారు. దీంతో రోగులకు తగ్గట్టు బెడ్స్ లేకపోవడంతో ఇన్ పేషెంట్స్‌గా వచ్చే వ్యసనానికి బానిసైన వారికి వైద్యం అందించే పరిస్థితుల్లేవనే చెప్పాలి.

పెరుగుతున్న మద్యం అమ్మకాలు, కేంద్రాలు

వ్యసనాల్లో ప్రధామైనదిగా మద్యం అని చెప్పవచ్చు. సర్వజన ఆసుపత్రికి వస్తున్న వారిలో 90 శాతం మంది వారే ఉంటున్నారు. పది శాతం వరకు గంజాయి, రసాయానాలు వాడే వారు ఉంటున్నట్టు అక్కడి మానసిక వైద్యులు డాక్టర్ శశాంక్ తెలిపారు. మద్యం విక్రయాలు చూస్తే ప్రభుత్వం 2019లో తగ్గించేందుకు గట్టి చర్యలే చేపట్టింది. దుకాణాలను చాలా వరకు తగ్గించింది. ఆ తరువాత క్రమంగా పెంచుతూ పోతుండటం గమనార్హం. ఎలైట్ షాపుల పేరుతో విక్రయ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయడమే కాకుండా మద్యం బార్ల సంఖ్యను పెంచేసింది. దీంతో జిల్లాలో మద్యం అమ్మకాలు జోరు కూడా పెరుగుతోంది. మద్యం అమ్మకాల తగ్గించేందుకు చర్యలు తీసుకున్న క్రమంలో 2020 జిల్లాలో మద్యం అమ్మకాలు ఏడాదిలో రూ.900 కోట్ల వరకే పరిమితమైంది. ఇప్పుడు అది వెయ్యి కోట్లకు దాటి పోతోంది. ఇవి కాకుండా నాటుసారా, పక్క రాష్ట్రాల నుంచి వస్తున్న అక్రమ మద్యం అధికంగా ఉంటోంది.

పకడ్బందీగా పంటనమోదు

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఛైర్మన్ రమణారెడ్డి, కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో రబీకి సబంధించి పంట నమోదు ప్రక్రియను పకడ్బందీగా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఎ.రమణారెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ రబీ ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ ద్వారా ప్రొక్యూర్మెంట్, ఇన్సూరెన్స్, ఇనుపుట్ సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందులో క్షేత్రస్థాయిలో రైతులు ఏ పంట సాగు చేశారు.? ఎన్ని ఎకరాల్లో వేశారు.? తదితర అన్ని రకాల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా చిరుధాన్యాలను సబ్సిడీ పైన రైతులకు అందించి వాటి సాగును ప్రోత్సహించాలని అధికారులను కోరారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు కావాల్సిన సూచనలు సలహాలను ఎప్పటికప్పుడు అందించి జిల్లాలో వ్యవసాయ అభివద్ధికి కషి చేయాలన్నారు. మొక్కజొన్న పంటకు బీమా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించి వాటి సాగును ప్రోత్సహించే విధంగా సూచనలు, సలహాలు క్షేత్రస్థాయిలో అందివ్వాలని తెలిపారు, ఒక సెంటు భూమి కూడా తప్పిపోకుండా పంట నమోదు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం, ఈ క్రాప్ బుకింగ్ ఎన్ని ఎకరాలు చేయాల్సి ఉంది, ఈ క్రాప్ బుకింగ్ లో పాటించాల్సిన అంశాలు, రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల లభ్యత తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారుల అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిడబ్ల్యూఎంఎ పీడీ రామాంజనేయులు, డిపిఎం లక్ష్మణ్ నాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, సిరికల్చర్ జెడి పద్మావతి, జిల్లా అగ్రికల్చర్ ట్రేడ్, మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి, కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త సంపత్ కుమార్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధృవీకరణ పత్రాల కోసం లబ్ధిదారుల అవస్థలు



తహశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

జగనన్న చేదోడు లబ్ధిదారులు కుల, రాబడి ధృవీకరణ పత్రాల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. చేదోడుకు 27న చివరి తేదీ అని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్దిదారులు ధృవీకరణ పత్రాల కోసం తహశీల్దార్ కార్యాలయానికి క్యూ కట్టారు. కుల ధృవీకరణ పత్రం కొత్తది జతచేయాలని కోరడంతో వాటి కోసం లబ్దిదారులు నానా హైరానా పడుతున్నారు. చివరి తేదీ గురించి తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని లబ్దిదారులు సచివాలయ వద్ద వాదనకు దిగుతున్నారు. మండల వ్యాప్తంగా గత సంవత్సరం 323 మంది లబ్దిదారులకు 'చేదోడు' అందింది. ఈ ఏడాది మరో వంద మంది దాక కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ ఏడాది అందరూ ఖచ్చితంగా కుల ధృవీకరణ పత్రం అందజేయాల్సుంది. దీంతో ధృవీకరణ పత్రాల అప్రూవల్ చేయించుకోవటానికి లబ్దిదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

గోరంట్ల : పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్త ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్ కుమార్, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రొద్దం : మండలంలోని 220 కేవీ కింద ఉన్న బొక్సంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు చెప్పారు. అత్యవసర మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో మండలంలోని తురకలాపట్నం, రొద్దం, రాగిమేకలపల్లి, పెద్దమంతూరు, మావటూరు గ్రామాలలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎఇ శ్రీనివాస్ మూర్తి కోరారు.

ముగిసిన బాబా షర్ఫుద్దీన్ ఉరుసు ఉత్సవాలు

తలుపుల : మండల కేంద్రంలో బాబాషర్ఫుద్దీన్ ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు దర్గా కమిటీ వారి ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖులు దర్గాను సందర్శించి ప్రార్థనలు జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి, నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, బత్తల హరిప్రసాద్, వాల్మీకి పవన్, తెలుగుదేశం నాయకులు కందికుంట వెంకటప్రసాద్, అత్తర్ చాంద్‌బాషా, బిజెపి వజ్ర భాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, మాజీ సర్పంచి ఫయాజ్ అహ్మద్, తలుపుల సర్పంచి శ్రీలత, ఉప సర్పంచి డికె బాబు తదితరులు దర్గాను సందర్శించి ప్రార్థనలు జరిపారు.

'బైరెడ్డి'పై జనసేన ఫైర్

ధర్మవరం టౌన్ : బైరెడ్డి రాజశేఖర్ మాట తీరుపై జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేలాగున్న అభిప్రాయాన్ని తమ అధినేత వెలిబుచ్చితే అందుకు బైరెడ్డి మాట్లాడిన మాటలు ఆక్షేపణీయంగా ఉన్నాయన్నారు. బైరెడ్డితో తలపడడానికి తమ అధినేత వరకు అవసరం లేదని తమ కార్యకర్తలు చాలని అన్నారు. తమ అధినేతను విమర్శించే స్థాయి బొత్స సత్యనారాయణకు లేదన్నారు. వైసీపీని గద్దెను దించి, రాష్ట్రాన్ని కాపాడుకోవడమే జనసేనపార్టీ లక్ష్యమని అన్నారు.

రెస్టారెంట్ ప్రారంభం

కదిరి టౌన్ : పట్టణంలోని ఆర్అండ్‌బీ రోడ్డు వద్ద భాస్కర్ అయ్యప్ప సోదరులు ఏర్పాటు చేసిన లిటిల్ ఏసీ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుచికరమైన ఆరోగ్యకరమైన నాణ్యత కలిగిన ఆహారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన లిటిల్ ఏసి రెస్టారెంట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ డైరీ ఆవిష్కరణ

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి వ్యవసాయ శాఖ అధికారుల రూపొందించిన 2023 సంవత్సరపు డైరీని కలెక్టర్ బసంత్ కుమార్ తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ డైరీ రైతులకు ఉద్యోగస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. దీనిలో జిల్లా వ్యవసాయ శాఖకు సంబంధించి ఎంతో సమాచారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు అవుటాల రమణారెడ్డి, డివిజన్ మండల స్థాయి వ్యవసాయ అధికారులు, జిల్లా సంఘం అధ్యక్షులు వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

'యువగళం'కు తరలిన తెలుగు తమ్ముళ్లు

తనకల్లు : కుప్పంలో ప్రారంభమైన నారా లోకేష్ యువగళం పాదయాత్రకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి శుక్రవారం పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. తొలుత మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ వద్ద నుండి వాహనాలు బయలుదేరగా బాణాసంచా కాల్చుతూ ఆనందోత్సాహాల నడుమ తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు షేక్ బాబ్జాన్, కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగు యువత గంగయ్య నాయుడు, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు సోంపాళ్యం నాగభూషణ, వార్డ్ మెంబర్ దామోదర్, జియావుల్లా, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


తనకల్లులో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

కదిరి టౌన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువ గళం పాదయాత్రకు కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో 100 వాహనాలలో తెలుగు తమ్ముళ్లు కుప్పం బయలుదేరి వెళ్లారు.

జమున మృతి తీరని లోటు

కదిరి టౌన్: అలనాటి మేటి నటి జమున(86) మృతి సినీ ప్రపంచానికి తీరని లోటు అని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె మరణం భారతీయ సినిమా పరిశ్రమకే తీరని లోటు అని అన్నారు. తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లోని చిత్రాల్లోని సుప్రసిద్ధ నటులతో నటించారన్నారు. సంగీతంలో ప్రవేశమున్న జమున హార్మోనిస్టుగా కూడా విశేష ప్రతిభ కనబరచారన్నారు. ప్రజానాట్యమండలి పునరుద్ధరణ సమయంలోనూ అమె సహకరించారన్నారు. ఆమె మృతికి సంతాపం తెలుపుతున్నామన్నారు.

శ్రీశైలానికి అదనపు బస్సు సర్వీసులు

కదిరి టౌన్ : మాఘమాసాన్ని పురస్కరించుకొని కదిరి నుంచి శ్రీశైలానికి రెండు అదనపు బ్సు సర్వీసులను ఈనెల 30 నుండి నడపనున్నట్టు కదిరి ఆర్టీసీ డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. ప్రతి రోజు కదిరి లో ఉదయం 7, రాత్రి 8 గంటలకు కదిరి నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమవుతాయని చెప్పారు. అంతేకాకుండా శ్రీశైలంలో భక్తులకు స్పర్శ దర్శనానికి రూ.500, అతి శీఘ్ర దర్శనానికి రూ.300, శీఘ్ర దర్శనానికి రూ.150లు అదనపు రుసుముపై ఆర్టీసీ బస్సుల ద్వార దర్శనం చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపిది నియంతృత్వ పాలన

కొత్తచెరువు : రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను అణిచివేయడానికి వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ 1ని జారీ చేసిందని ఇది వైసిపి ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ విమర్శించారు. కొత్తచెరువులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాటి జీవోలను తీసుకొచ్చి ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించకుండా వారి గొంతు నొక్కుతోందన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారే లేకపోతే ప్రజలకు న్యాయం ఎక్కడ జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి తగిన మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు. ఈసమావేశంలో సిఐటియు నాయకులు గంగాధర్, భవన నిర్మాణ సంఘం నాయకులు ముత్యాలు, హమాలీ యూనియన్ నాయకులు శంకర్ రెడ్డి, జయరాం, రామాంజి, వెంకటేష్, రాజేంద్ర, స్వచ్ఛభారత్ కార్మికులు నాగభూషణ్, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

హిందూపురం : గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు ఉత్తమ అధికారిగా అవార్డు వచ్చిన నేపథ్యంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఆయనను సన్మానించారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో ఆయనను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బండి ఆనంద్‌రాజు, రామాంజి, రాము, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు

దారి మూసివేశారని రైతుల ఆందోళన

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని బూదిలి తండా సమీపాన తమ పొలాలకు వెళ్లే దారి మూసివేశారన్న ఆగ్రహంతో పలువురు రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి పోతలపల్లి, చాగలేరు, గుమాలపల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాలకు ఈ దారి నుండే రాకపోకలు కొనసాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో బూదిలి తండా వద్ద ఈ దారికి భూ యజమాని ఈ రస్తా భూమి తనకే చెందుతుందని రాతి బండలు నాటడంతో తమకు దారి లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి తమకు దారి సౌకర్యం కల్పించాలని తండాకు చెందిన రైతులు కోరుతున్నారు.

త్వరలో రైల్వే రోడ్డు పనులు పూర్తి

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణంలోని రైల్వే రోడ్డు విస్తరణతో పాటు పనులను త్వరలో పూర్తి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన మురుగు కాలువ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.85 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికే 85శాతం పూర్తి అయిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఇ నీరజ, ఎఇలు పాల్గొన్నారు,


రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ చొరవతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణానికి పోచనపల్లికి అనుసంధానంగా ఉన్న పెన్న వంతెన గతంలో కురిసిన వర్షానికి కూలి పోయింది. ఆ సమయంలో ద్విచక్ర వాహనాలు, పాదచారులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రూ.80లక్షలతో నూతన వంతెనను మంజూరు చేయించారు. అయితే పనులు వేగవంతంగా పూర్తి కాక పోవడంతో సమస్యను స్థానికులతో పాటు ఆటో నిర్వాహకులు రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఆటో, ద్విచక్ర వాహనాలతో పాటు పాదచారులకు ఇబ్బంది లేకుండా ఉండడానికి మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులు శుక్రవారం బేవినహళ్లి సర్పంచి ఆనంద్, వైసిపి నాయకులు ఆనంద్ రెడ్డి, మల్లేష్, ప్రణయ్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

దళితవాడకు రోడ్డు సౌకర్యం కల్పించండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ పరిధిలోని 2వ వార్డు చౌడేశ్వరి కాలనీ దళితవాడకు వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం దళిత వాడను సందర్శించి, ఆ ప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రభుత్వం దళిత వాడల అభివృద్ధికి విడుదల చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిందన్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దళిత వాడలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నారాయణప్ప, సుగూరు గోపాలప్ప తదితరులు పాల్గొన్నారు.

త్వరలో యూనియన్ కార్యాలయ భవన నిర్మాణం

హిందూపురం : పట్టణంలోని ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యలయం కోసం భవన నిర్మాణానికి తన వంతు పూర్తి సహయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. జాతీయ ఎలక్ట్రికల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని రహమత్‌పురంలో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సముదాయ కమిటీ భవన నిర్మాణం చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు మారుతి రెడ్డి, ముస్తాక్ పటేల్, కో ఆప్షన్ మెంబర్ రహమత్, ఎలక్ట్రికల్ యూనియన్ ప్రెసిడెంట్ జిలాన్‌బాషా, లక్ష్మీనారాయణ, నాయకులు లతీఫ్ సేట్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక కవి వేమన

ప్రజాశక్తి-హిందూపురం

విలువలతో కూడిన సమాజం నిర్మించడానికి, తన రచనలతో మూఢనమ్మకాలను రూపు మాపడానికి యోగి వేమన చేసిన కృషి అమోఘమని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని సడ్లపల్లి ఆటోనగర్ సర్కిల్ వద్ద రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేమన విగ్రహానికి ఎమ్మెల్సీ ఇక్బాల్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేమన రచనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, స్థానిక కౌన్సిలర్ సునీత వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్ మారుతీ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, పురుషోత్తం రెడ్డి, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ


మృతిచెందిన గొర్రెలు

నీటి గుంతలో పడి గొర్రెలు మృతి

మడకశిర రూరల్ : మండలంలోని మెలవాయి గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లకు చెందిన గొర్రెలు పెద్ద చెరువులోని నీటిగుంతలో పడి గొర్రెలు మృతిచెందాయి. మరికొన్ని గల్లంతయ్యాయి. చెరువులోని నీటి కోసం ఓ గుంత వద్ద దాదాపు 110 గొర్రెలు ఎగబడటంతో నీటి గుంతలోని కంప చెట్లలోకి పడి పది గొర్రెలు మృతిచెందాయి. మరో 25 గొర్రెలు గల్లంతయ్యాయి విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది చెరువులో గల్లంతైన గొర్రెల కోసం గాలిస్తున్నారు. కళ్లముందే గొర్రెలు మృతిచెందడంతో గ్రామానికి చెందిన బాధిత గొర్రెల కాపర్లు కంసలి అయ్యన్న, శివన్న లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తమకు ఆదుకోవాలని కోరుతున్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలే కళాశాల విద్యార్థి అదృశ్యం

లేపాక్షి : మండల కేంద్రం లోని మహాత్మా జ్యోతి బాపూలే కాలేజీ విద్యార్థి రఘవరన్ బుధవారం నుండి కన్పించడం లేదని అతని తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. కర్నూల్ జిల్లా తుగ్గలి మండలం ఎర్రబల్లి గ్రామానికి చెందిన రఘువరన్ ఇంటర్ చదువుతున్నాడు. రెండు రోజులు నుండి కళాశాలకు హాజరుకాలేదు. సొంతగ్రామానికి గాని వెళ్లలేదు. ఈ మేరకు విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.


రఘువరన్(ఫైల్)

'కేతిరెడ్డి' అనుచరులపై ఫిర్యాదు

ధర్మవరం టౌన్ : స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనుచరులత నుంచి తమకు ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించాలని బిజెపి స్థానిక నాయకులు ఎస్‌బి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆపార్టీ నాయకులు చిగిచెర్ల అరవిందరెడ్డి నాయకులు గొట్లూరుచంద్ర తుంపర్తి పరమేశ్, చిలకం సూర్యనారాయణరెడ్డి తదితరులతో కలిసి ఎస్‌బి డీఎస్పీని శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా అరవిందరెడ్డి మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలు, కబ్జాలు, దౌర్జన్యాల గురించి ప్రెస్‌మీట్‌లో విమర్శిస్తున్నామని తమపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. గతంలో కూడా అధికార పార్టీ నాయకులపై విమర్శలు చేశామని ప్రెస్ క్లబ్‌లో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఏకంగా అధికార పార్టీ నాయకులు సమావేశాల్లో, వారి కార్యాలయాల్లో తమపై దాడి చేస్తామని ప్రత్యక్షంగా చెప్పారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అనుచరులు తనపై కక్ష పెట్టుకుని నెల రోజులుగా దాడి చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు తనను వెంబడిస్తున్నారని, తనకు ఏదైనా జరిగితే ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలని చిగిచెర్ల అరవిందరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు తనకు రక్షణ కల్పించాలని ఆయన డీఎస్పీని కోరారు.

'పది'లో మంచి మార్కులు సాధించాలి



సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్నప్రొఫెసర్ రామకష్ణారెడ్డి)

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రతి విద్యార్థి విద్యలో రాణిస్తూ పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, ధర్మవరం ఇన్‌ఛార్జి డీఎస్పీ హుస్సేన్‌పీరా కోరారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో గల యశోద కాన్సెప్ట్ పాఠశాల 15వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రొఫెసర్, డీఎస్పీ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం గత ఏడాది పదవ తరగతి పరీక్షలలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ శంకరనారాయణ, డైరెక్టర్ రవీంద్ర, కరస్పాండెంట్ మల్లికార్జున అభినందించి జ్ఞాపికతోపాటు రూ.5 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపల్ అనూప్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా : ఎస్పీ


రికార్డు లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఆంధ్రా, కర్నాటక సరిహద్దు మండలంగా ఉన్న చిలమత్తూరు వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలనిఅక్రమ మద్యం సరఫరా, గుట్కా నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పోలీసులను అదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, కేసు డైరీ, విలేజ్ రోస్టర్, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాత నేరస్తులు రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత గ్రామాలలో శాంతి భద్రతలు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి చట్టపరమైన సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా సుబ్రమణ్య స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి- పరిగి

మండల కేంద్రంలోని జయమంగళీ నది ఒడ్డున ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. షష్టి మహోత్సవం, కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు, దాతల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ స్థల దాతలు పరిగి సీతమ్మ వేంకోబాచార్ల మనువడు పరిగి వేణుగోపాల రావు మాట్లాడుతూ ఆలయాన్ని నిర్మాణం కోసం తమ పూర్వికులు ఎన్నో విధాలుగా తోడ్పాటు అందించారని అదే స్ఫూర్తితో ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో ఆలయం వద్ద కల్యాణ మండపాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గామస్తులు పాల్గొన్నారు.


కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు


కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - సోమందేపల్లి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని పందిపర్తి పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా సర్పంచి ఎర్రమ్మ, వైసీపీ యువ నాయకులు గజేంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ అశోక్, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం


హిందూపురం పురపాలక సంఘంలో పేదరిక నిర్మూలన కోసం మహిళలకు టైలరింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పాండురంగ నగర్‌లో శిక్షణ కేంద్రాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దీన దయాళ్ అంత్యోదయ యోజన, పట్టణ జాతీయ జీవనోపాదుల మిషన్ ద్వారా పురపాలక సంఘంలోని 18 నుంచి 35 సంవత్సరాల వయస్సున్న మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తున్నామని. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం హరినాథ్‌రెడ్డి, ధనుంజయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

బాలయ్య హయాంలో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన :హయంలో చేసిన అభివృద్ధి శూన్యమని కేవలం ఆయన తన తండ్రి ఎన్టీఆర్ చేసిన అభివృద్ధి గురించే ఇప్పటి వరకు మాట్లాడుతున్నారని నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఇక్బాల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. బాలకృష్ణ మాటలు చూస్తుంటే చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎప్పుడు చూసినా తన తండ్రి ఎన్ టి రామారావు చేసిన అభివృద్ధి గురించే మాట్లాడుతున్నారు తప్ప తాను చేసిన అభివృద్ధి గురించి చెప్పడం లేదన్నారు. ఎందుకంటే ఆయన చేసిన అభివృద్ధి ఏదీ లేదని అన్నారు. కనీసం హిందూపురం పురపాలక సంఘంలో పూర్తిస్థాయిలో ఒక మురుగుకాలువను సైతం నిర్మాణం చేయలేకపోయారన్నారు. పరిపాలన వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి భావించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసీపీకి దక్కుతుందన్నారు. బాలయ్యకు చిత్తశుద్ధి ఉంటే ఓట్లు వేసిన ప్రజలకు సేవ చేయాలన్న తపన ఉంటే ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని, వాటిపై శాసనసభలో చర్చించాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ మారుతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రమాదాల నివారణలో డ్రైవర్ల బాధ్యత కీలకం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

-డ్రైవర్ల బాధ్యతగా రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి. మధుసూదన్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత రవాణా ఉత్సవాలు ప్రారంభ రోజున శుక్రవారం పుట్టపర్తి డిపోలో జరిగిన గేట్‌మీటింగ్‌లో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2 వరకు జిల్లా వ్యాప్తంగా ఆయా డిపోలలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం, 28న శిక్షణ తరగతులు, 29న వాహనాల మరమ్మతులు, 30న డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు, 31న ప్రమాదాలు చేసిన డ్రైవర్ల కుటుంబాలకు కౌన్సిలింగ్, వచ్చే నెల ఒకటిన సిబ్బందిచే రక్తదాన కార్యక్రమం, రెండవ తేదీన డ్రైవర్ల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆఖరిరోజున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎలాంటి ప్రమాదాలు చేయని డ్రైవర్లను ఎంపిక చేసి ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ శిక్షణలో ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొంటారన్నారు. ప్రతి డిపోలోను రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించాలని డిపో మేనేజర్లను ఆదేశించామన్నారు.


గేట్ మీటింగ్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారి

మహారాజశ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో

MVOP. No.168/2022

ఓంకార్. ...అర్జీదారు

-ఎదురి-

కల్పతరు స్టీల్ రోలింగ్ Rep. By అనిల్ సోలంకి వగైరా. ...రెస్పాండెంట్లు

1,3 రెస్పాండెంట్లకు నోటీసులు

1.కల్పతరు స్టీల్ రోలింగ్
Rep. By అనిల్ సోలంకి, వెహికల్ ఓనర్, మేజర్, R/o ప్లాట్. నెం.55,56, ఆజాద్ నగర్, హిందూపూర్ అనంతపురం జిల్లా.
3.అంజినప్ప తండ్రి భీమప్ప, వెహికల్ డ్రైవర్, R/o కొట్నూరు గ్రామం,హిందూపూర్ (మండలం) అనంతపురం జిల్లా.

పై నెంబర్ ఎం. వి. ఓ. పి లో అర్జీదారు తనకు రోడ్డు ప్రమాదంలో జరిగిన గాయములకు నష్టపరిహారం రూ.3,00,000/-లు, ఇందుపైన వడ్డీ, మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసినాడు. ఇందులో 1,3 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైనా ఆక్షేపణ ఉన్న 03-02-2023 వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింప బడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

బి.జ్యోతి ప్రకాష్,
అర్జీదారు పరం అడ్వకేట్,
కర్నూలు.